విలేకరులు కావలెను

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్
రాష్ట్రాల వ్యాప్తంగా వెలువడుతున్న
పరివర్తన అవాజ్ దినపత్రికలో
పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్స్,
నియోజకవర్గ ఆర్.సిలు,
మండల స్థాయి రిపోర్టర్లుగా
పనిచేయుటకు ఉత్సాహం కలిగిన
యువతీ, యువకులు కావలెను.

సీనియర్లకు మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును.

పరివర్తన ఆవాజ్

TGBIL/25/A2214 తెలుగు ఉర్దూ దినపత్రిక

PARIVARTHANA AWAAZ

పేపర్‌లో యాడ్స్ కొరకు
సంప్రదించండి
9704903467
8886183468

కామారెడ్డి - హైదరబాద్ - వరంగల్ - సంగారెడ్డి | 01-11-2026 ఆదివారం | సంపుటి:02 సంచిక : 30 | రూ॥ 5-00 | పేజీలు : 5

పిల్లల భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి..

పోక్సో చట్టం, సైబర్ నేరాలు, బాలల అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమం.





పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక అక్టోబర్ 31వరంగల్ : హన్మకొండ లోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ఉన్నత పాఠశాలలో "సురక్షిత్ బచ్‌పన్ అభియాన్" జాతీయ ప్రత్యేక కార్యాచరణలో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ హన్మకొండ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక లీగల్ లిట్రసీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న హన్మకొండ జిల్లా జడ్జి సునిత గారు, డి. ఎల్. ఎస్. ఏ సెక్రటరీ హైమ పూజిత, ట్రిబ్యునల్ కోర్టు మెంబర్, అనురాగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి పాల్గొని పిల్లల తో మాట్లాడారు, పిల్లల భద్రత, హక్కులు, రక్షణపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మంచి స్పర్శ, చెడు స్పర్శ మధ్య తేడాను గుర్తించడం, ఎవరైనా అనభ్యంగా ప్రవర్తించినప్పుడు భయపడకుండా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయడం ఎంతో ముఖ్యమని వివరించారు.అలాగే, లైంగిక నేరాల నుంచి పిల్లలకు రక్షణ కల్పించే పొజూ చట్టం--2012 గురించి వివరించి, పిల్లలపై లైంగిక వేధింపులు జరిగితే తీసుకోవాల్సిన చర్యలు, ఫిర్యాదు చేసే విధానం గురించి అవగాహన కల్పించారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తులతో ఆన్‌లైన్‌లో వ్యక్తిగత వివరాలు, ఫొటోలు పంచుకోకూడదని, అనుమానాస్పద లింకులను తెరవకూడదని విద్యార్థులకు సూచించారు.అదేవిధంగా, బాలల అక్రమ రవాణా వల్ల కలిగే ప్రమాదాలను వివరిస్తూ, అపరిచిత వ్యక్తులు ఇచ్చే ప్రలోభాలకు గురికా కూడదని అనుమానాస్పద పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే పెద్దలకు సమాచారం అందించాలని తెలిపారు. పిల్లల రక్షణ కోసం చైల్డ్ హెల్ప్ లైన్ 1098 సేవలు అందుబాటులో ఉన్నాయని, ఆపదలో ఉన్న పిల్లలకు సహాయం అందించేందుకు ఈ సేవలను వినియోగించుకోవాలని వివరించారు.పిల్లలకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధికారులు, సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హన్మకొండ జిల్లా జడ్జి సునిత గారు, డి. ఎల్. ఎస్. ఏ సెక్రటరీ హైమ పూజిత, ట్రిబ్యునల్ కోర్టు మెంబర్ డాక్టర్ అనితా రెడ్డి,పాఠశాల ప్రిన్సిపాల్, డి. డబ్ల్యు.ఓ విశ్వజ, జి. సి. డి. ఓ సునిత,రవి,కవిత యాజమాన్యం, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్ఓఎఫ్ఆర్ అమలుపై సమీక్షించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక వరంగల్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 31: జిల్లాలో అటవీ హక్కుల గుర్తింపు చట్టం (ఆర్ఓఎఫ్ఆర్) అమలుకు సంబంధించి చేపడుతున్న చర్యలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సమీక్షించారు.జిల్లా కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన ఆర్ఓఎఫ్ఆర్ జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో జిల్లా అటవీ అధికారి (డీఎఫ్ఓ) నిఖిల, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వాత్సల్ టోప్పో, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్ కుమార్ తదితర అధికారులతో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. రైతులు బోర్‌వెల్ డ్రిల్లింగ్ అనుమతుల కోసం సమర్పించిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పరిశీలించారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు



తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమీక్ష లో నర్సంపేట ఆర్డీవో ఉమారాణి,జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి నారాయణ రెడ్డి,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

తక్కువ తూకంతో విక్రయిస్తే కఠిన చర్యలు...

బియ్యం, కిరాణా దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు...

నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులపై 10 కేసులు నమోదు

వరంగల్ జిల్లా ప్రతినిధి పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక అక్టోబర్ 31 వినియోగదారులకు సరుకులను నిర్ణీత తూకం కంటే తక్కువగా విక్రయిస్తూ మోసాలకు పాల్పడితే వ్యాపారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి కూచన మనోహర్ హెచ్చరించారు.శనివారం వరంగల్ పట్టణంలోని పలు బియ్యం దుకాణాలు, కిరాణా, జనరల్ స్టోర్లలో తూనికలు, కొలతల శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బియ్యం బస్తాలను తూకం వేయగా, 26 కిలోలుగా పేర్కొన్న బస్తాల్లో కేవలం 25 కిలోల బియ్యం మాత్రమే ఉన్నట్లు గుర్తించి మరియు ప్యాకేజ్డ్ కమోడిటీస్ నిబంధనలను ఉల్లంగించిన వారిపై 10 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా కూచన మనోహర్ మాట్లాడుతూ, ప్రతి వ్యాపారి ప్యాకింగ్ చేసిన సరుకులపై నికర బరువును స్పష్టంగా ముద్రించాలని, ప్రకటించిన బరువుకు అనుగుణంగానే వినియోగదారులకు సరుకులు విక్రయించాలని సూచించారు. బస్తాలపై పేర్కొన్న బరువు కంటే తక్కువగా సరుకులు విక్రయిస్తే తూనికలు, కొలతల చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.వినియోగదారులు సైతం సరుకులు కొనుగోలు చేసే సమయంలో ప్యాకెట్లపై ముద్రించిన నికర బరువును, తూకాన్ని పరిశీలించాలని సూచించారు. వ్యాపారులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, వినియోగదారుల హక్కులను కాపాడేందుకు తనిఖీలు కొనసాగిస్తామని ఆయన తెలిపారు

పట్టభద్రుల ఓటు నమోదు గడువు నవంబర్ 6 వరకు మాత్రమే...

వెంటనే నమోదు చేసుకోండి: ఎమ్మెల్యే నాయిని.

పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక అక్టోబర్ 31 వరంగల్ జిల్లా : వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని పట్టభద్రులందరికీ నా విజ్ఞప్తి. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు నమోదు చేసుకోవడానికి నవంబర్ 6వ తేదీ చివరి గడువు. సమయం చాలా తక్కువగా ఉన్నందున ఇప్పటివరకు ఓటు నమోదు చేసుకోని పట్టభద్రులు వెంటనే తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరుతున్నాను. ఇప్పటికే చాలామంది పట్టభద్రులు ఓటు నమోదు చేసుకున్నారు. ప్రజాస్వామ్యంలో చదువుకున్న ప్రతి ఒక్కరి నిర్ణయం ఎంతో కీలకం. మీ ఓటు మీ గొంతుక. మీ ఆలోచన, మీ నిర్ణయం భవిష్యత్తు దిశను ప్రభావితం చేస్తాయి.కాబట్టి అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, నవంబర్ 6వ తేదీలోగా



తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను.మీ ఓటు హక్కును వినియోగించుకోండి.. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయండి.

ఘనంగా ఇందిరా గాంధీ వర్ధంతి, సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు

దేశ సమగ్రత, ఐక్యతకు ఇద్దరు మహనీయుల సేవలు చిరస్మరణీయం: ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి..

వరంగల్ జిల్లా ప్రతినిధి పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక అక్టోబర్ 31 : హనుమకొండ: భారత మాజీ ప్రధాని, భారత ఉక్కు మహిళ శ్రీమతి ఇందిరా గాంధీ 42వ వర్ధంతి, భారత తొలి ఉప ప్రధాని, భారత ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను శనివారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా



ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ దేశ సమగ్రత, సమైక్యత, ఐక్యత కోసం తమ జీవితాలను అంకితం చేసిన ఇద్దరు మహనీయులను ఒకే రోజు స్మరించుకోవడం గర్వకారణమని పేర్కొన్నారు. వందలాది సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసి అఖండ భారత నిర్మాణానికి పునాది వేసిన ఘనత సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు దక్కుతుందని, ముఖ్యంగా హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయడంలో ఆయన చూపిన దృఢ సంకల్పం, నాయకత్వం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని కొనియాడారు.అదేవిధంగా ఇందిరా గాంధీ దేశాభివృద్ధి, పేదరిక నిర్మూలన కోసం చేపట్టిన విప్లవాత్మక నిర్ణయాలు దేశ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయని తెలిపారు. 'గరీబీ హటావో' నినాదంతో పేదల సంక్షేమానికి కృషి చేయడంతో పాటు బ్యాంకుల జాతీయీకరణ, భూసంస్కరణలు వంటి కీలక నిర్ణయాలతో సామాజిక, ఆర్థిక రంగాల్లో మార్పులకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడే క్రమంలో ప్రాణత్యాగం చేసిన ఇందిరా గాంధీ సేవలు, త్యాగం ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.మహనీయుల ఆశయాలకు అనుగుణంగా గౌరవ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని తెలిపారు. హనుమకొండ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, టీపీసీసీ అధికార ప్రతినిధి కూచన రవళి, వరంగల్ ఎనుమాముల మార్కెట్ చైర్మన్ పులి ప్రియాంక, టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాసరావు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ, మాజీ కార్పొరేటర్లు, డీసీసీ కమిటీ సభ్యులు, మండల, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, నాయకురాళ్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశ ఐక్యత, సమగ్రత, భద్రత పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వరంగల్ జిల్లా ప్రతినిధి పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక అక్టోబర్ 31: సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలు, స్ఫూర్తితో దేశ ఐక్యత, సమగ్రత, భద్రత పరిరక్షణకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి, జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దేశ సమైక్యత కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలు, కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు.అనంతరం జాతీయ ఐక్యతా దినోత్సవం (రాష్ట్రీయ ఏక్తా దివస్) సందర్భంగా దేశ సమైక్యత, సమగ్రత, భద్రతను కాపాడేందుకు ప్రతి



ఒక్కరూ కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్ కుమార్, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్,కలెక్టరేట్ ఏ.ఓ శ్రవణ్ కుమార్,కలెక్టరేట్ సెక్షన్ సూపర్డెంట్లు ,సంబంధిత అధికారులు ,సిబ్బంది పాల్గొన్నారు.

హనుమకొండలో ఐడియల్ హోమియోపతి క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

పిల్లలు పుట్టకుండా ఉండడం, పిసిఓడి, షుగర్, ఉబ్బసం సహా 35కి పైగా వ్యాధులకు ఉచిత పరీక్ష, నవంబర్ 1న బొక్కలగడ్డలో శిబిరం...

పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక అక్టోబర్ 31: ముస్లిం వెల్ఫేర్ సొసైటీ వరంగల్ ఆధ్వర్యంలో మరియు ఐడియల్ హోమియోపతి క్లినిక్ తరఫున ఒక రోజు ఉచిత హోమియోపతి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ శిబిరం తేదీ 1 నవంబర్ 2026, ఆదివారం రోజున, ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు, వేదిక ఐడియల్ గర్ల్స్ హాస్టల్, చర్చి దగ్గర, బొక్కలగడ్డ, హనుమకొండ లో నిర్వహించబడుతుంది.ఈ శిబిరంలో సీనియర్ హోమియోపతి కన్సల్టెంట్ లిడాక్టర్ ఆయేషా మరియు డాక్టర్ మహ్మద్ జావీద్ రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారు. ఇక్కడ అడ్వాన్స్ కాన్స్టిట్యూషనల్ ట్రీట్మెంట్ ద్వారా గొడ్రాలితనం, పిసిఓడి, యుటెరైన్ ఫైబ్రాయిడ్స్, లైంగిక సమస్యలు, డిస్క్ ప్రాబ్లమ్, మెడ మరియు నడుము నొప్పి, డయాబెటిస్, థైరాయిడ్, అలర్జీ, ఉబ్బసం, సైనసైటిస్, మోకాళ్ళ మరియు కీళ్ళ నొప్పులు, రుమటాయిడ్ ఆర్థరైటిస్, సొరియాసిస్, ఎగ్జిమా, బొల్లి (తెల్ల మచ్చలు), మైగ్రేన్, వెరికోస్ వెయిన్స్, గ్యాస్/ఆసిడిటీ, ఐబిఎస్, డిప్రెషన్, యాంగ్జైటీ, కిడ్నీ మరియు గాల్ బ్లాడర్



లో రాళ్లు, పైల్స్, ఫిషర్, ఫిస్టులా సహా అన్ని పాత, దీర్ఘకాలిక మరియు ఆటో ఇమ్యూన్ వ్యాధులకు విజయవంతమైన చికిత్స అందించబడుతుంది.ఈ సందర్భంగా డాక్టర్ మహ్మద్ జావీద్ మీడియాతో మాట్లాడుతూ వరంగల్, హనుమకొండ మరియు కాజీపేట ప్రజలు ఈ ఉచిత వైద్య శిబిరంలో ఎక్కువ సంఖ్యలో పాల్గొని ఈ బంగారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్ఫూర్తి కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

విద్యార్థులు క్రమశిక్షణ, సమయపాలనతో ఉన్నత లక్ష్యాలను సాధించాలి



వరంగల్ జిల్లా ప్రతినిధి పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక అక్టోబర్ 31: వరంగల్‌లోని సీకేఎం కళాశాలలో శనివారం నిర్వహించిన స్ఫూర్తి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, బీసీ సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు పుష్పలత ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ కళాశాల, హాస్టల్‌లో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, ఇతర సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని కళాశాల యాజమాన్యానికి సూచించారు. హాస్టల్ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యార్థుల సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు కళాశాలలో ఫిర్యాదుల పెట్టె (కంప్లైంట్ బాక్స్) ఏర్పాటు చేయాలని సూచించారు.ప్రస్తుతం స్టూడెంట్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ హాస్టల్‌ను బీసీ విద్యార్థినుల సంఖ్య అధికంగా ఉన్నందున, హాస్టల్‌ను కమిషనర్ బీసీ సంక్షేమ శాఖ పరిధిలోకి తీసుకువచ్చేందుకు (టేకోవర్ చేసేందుకు) ప్రతిపాదనలు రూపొందించి సంబంధిత శాఖకు పంపించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు.విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించిన కలెక్టర్.. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.హాస్టల్ విద్యార్థులతో కమిటీ ఏర్పాటు చేసి, వారికి నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.కళాశాల అధ్యాపకులు హాస్టల్ విద్యార్థుల బాధ్యతను తీసుకొని వారి బాగోగులను పర్యవేక్షించాలని తెలిపారు.విద్యార్థినులు పట్టుదలతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, భవిష్యత్తులో ఉన్నత స్థాయి ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా నిలవాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న ఆశయాలను నెరవేర్చేలా కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీకేఎం కళాశాల ప్రిన్సిపాల్ పోచయ్య, అసోసియేట్ ప్రొఫెసర్ వరప్రసాద్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా ఢిల్లీలో ఘన నివాళులర్పించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు...





వరంగల్ జిల్లా పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక అక్టోబర్ 31 : భారతదేశ మాజీ ప్రధానమంత్రి, ఉక్కు మహిళ ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ఢిల్లీలోని ఇందిరా ఘాట్ వద్ద ఆమెకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ కి పుష్పాంజలి ఘటించి, దేశానికి ఆమె అందించిన సేవలను స్మరించుకున్నారు. దేశ సమగ్రత, సమైక్యత, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఆమె చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. భారతదేశ అభివృద్ధి, అంతర్జాతీయ స్థాయిలో దేశ గౌరవాన్ని పెంపొందించడంలో ఇందిరా గాంధీ కీలక పాత్ర పోషించారని గుర్తు చేసుకున్నారు.దేశం కోసం ఆమె చేసిన సేవలు, ధైర్యసాహసాలు, నాయకత్వ లక్షణాలు నేటి తరానికి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు గారు పేర్కొంటూ ఆమెకు ఘన నివాళులర్పించారు. వారితో పాటు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, వరంగల్ డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ ఆయుబ్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సహజమే.. సంస్థకు అందించిన సేవలు చిరస్మరణీయం: కమిషనర్ టి. వెంకన్న

పదవీ విరమణ పొందిన అదనపు కమిషనర్ జోనా, పారిశుద్ధ్య కార్మికుడు కుమార్‌లకు ఘన సన్మానం






వరంగల్ జిల్లా ప్రతినిధి పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక అక్టోబర్ 31: ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజమని, అయితే విధి నిర్వహణలో అంకితభావంతో అందించిన సేవలు, సంస్థ అభివృద్ధికి చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతాయని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న అన్నారు.శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో పదవీ విరమణ పొందిన అదనపు కమిషనర్ ఇసాంపల్లి జోనా, పారిశుద్ధ్య కార్మికుడు కుమార్‌లకు జీడబ్ల్యూ ఎంసి, జె ఏ సి సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్, అధికారులు, సిబ్బంది వారిని శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.అనంతరం కమిషనర్ మాట్లాడుతూ, మున్సిపల్ శాఖలో వివిధ హోదాల్లో సుమారు 44 సంవత్సరాల పాటు సేవలందించిన జోనా అనుభవం, అంకితభావం అభినందనీయమన్నారు. ఉద్యోగ జీవితంలో ఎన్నో బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఉన్నత స్థాయికి ఎదగడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. అదేవిధంగా పారిశుద్ధ్య నిర్వహణలో క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది సేవలు కూడా నగర ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రతకు ఎంతో కీలకమని, ప్రతి ఉద్యోగి కృషి సంస్థకు విలువైనదేనని అన్నారు.ఉద్యోగ విరమణ అనేది బాధ్యతల నుంచి విరామమే తప్ప, జీవితంలో కొత్త అధ్యాయానికి ప్రారంభమని పేర్కొంటూ, పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో గడపాలని, సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, సిటీ ప్లానర్ రవీందర్ రెడ్డి, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజేశ్వర్ రావు, ఉప కమిషనర్లు సమ్మయ్య, బిర్రు శ్రీను, ప్రసన్న రాణి, జేఏసి సభ్యులు బాకం సంతోష్, సర్జన రాజు వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది, పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతా సందేశంతో వరంగల్‌లో 5కె, 10కె వాక్ అండ్ రన్

జాతీయ సమైక్యత, సామాజిక సామరస్యం, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించడమే లక్ష్యం..

వరంగల్ పోలీస్ కమిషనర్ఎన్. శ్వేత..



వరంగల్ జిల్లా ప్రతినిధి పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక అక్టోబర్ 31. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని నిర్వహిస్తున్న జాతీయ ఐక్యతా దినోత్సవం, విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌లో భాగంగా శనివారం ఉదయం వరంగల్ నగరంలో నిర్వహించిన 5కె, 10కె వాక్ అండ్ రన్ కార్యక్రమాన్ని సిటీ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్నతో కలిసి సీపీ కార్యాలయ ఆవరణలో జెండా ఊపి ప్రారంభించారు.సీపీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ మట్టెవాడ పోలీస్ స్టేషన్ వరకు కొనసాగి, అక్కడి నుంచి తిరిగి సీపీ కార్యాలయ ఆవరణకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు వివిధ వర్గాలకు చెందిన యువత పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ కారకు వెంకట్రామ జంక్షన్ నుండి చింతల్ ఫ్లై ఓవర్ వరకు రోడ్డును పరిశీలించిన కమిషనర్ వెంకన్న



వరంగల్ జిల్లా ప్రతినిధి పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక అక్టోబర్ 31: వరంగల్ నగరంలో రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు.శనివారం కమిషనర్ టి. వెంకన్న, సిటీ ప్లానర్ రవీందర్ రెడ్డితో కలిసి వెంకట్రామ జంక్షన్ నుంచి చింతల్ ఫ్లైఓవర్ జంక్షన్ వరకు రోడ్డు విస్తరణకు సంబంధించిన ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోడ్డు విస్తరణకు ఆటంకంగా ఉన్న తాత్కాలిక ఆక్రమణలను తొలగించాలని అధికారులకు సూచించారు. రహదారి విస్తరణ పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా సమన్వయంతో ముందుకు సాగాలని ఆదేశించారు. సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఏసీపీ ఖలీలుద్దీన్, ఈ ఈ సంజయ్ కుమార్, డిఈ సురేష్ బాబు,టీపీఓ అభినాష్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు, పారిశుద్ధ్యంపై కమిషనర్ సమీక్ష: టి. వెంకన్న



వరంగల్ జిల్లా ప్రతినిధి పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక, అక్టోబర్ 31: నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా, నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు.శనివారం 29వ డివిజన్ రామన్నపేటలోని కమ్యూనిటీ హాల్, 30వ డివిజన్ బాలసముద్రం, 58, 59వ డివిజన్ల పరిధిలోని ఎన్జీవోస్ కాలనీ, ఇందిరానగర్, ఎక్సైజ్ కాలనీతో పాటు 55వ డివిజన్ భీమారం ప్రాంతాల్లో పర్యటించి నిర్మించిన రోడ్లు, డ్రైన్లు, కమ్యూనిటీ హాల్ పనులను పరిశీలించారు. నిర్మాణాల్లో నాణ్యతా లోపాలకు తావులేకుండా, ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగేలా పనులు చేపట్టాలని, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.ఈ సందర్భంగా డివిజన్ 29 రామన్నపేటలో పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించి, ప్రతి ఇంటి నుంచి స్వచ్ఛ ఆటోల ద్వారా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని ఆదేశించారు. రహదారులపై చెత్త పేరుకుపోకుండా, చెత్త నిల్వ కేంద్రాలు (గార్బేజ్ పాయింట్లు) ఏర్పడకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు.కమిషనర్ వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

జాతీయ ఐక్యతా దినోత్సవం నిర్వహించిన జిల్లా ఎస్పీ





పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక, అక్టోబర్ 31: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా హేమచంద్రపురంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో జాతీయ ఐక్యతా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, భారతదేశ తొలి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం అక్టోబర్ 31న జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. స్వాతంత్ర్యం అనంతరం దేశంలోని అనేక సంస్థానాలను ఏకీకృతం చేసి, భారతదేశ సమగ్రతకు, ఐక్యతకు పునాది వేయడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి అపారమని కొనియాడారు. ఆయన దృఢ సంకల్పం, నాయకత్వ లక్షణాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.దేశ సమగ్రత, ఐక్యతను కాపాడటంలో పోలీస్ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందని, ప్రజలకు న్యాయం అందించేలా, చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసేలా ప్రతి పోలీస్ అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. పోలీసింగ్‌లో క్రమశిక్షణ, నిబద్ధత, పారదర్శకత, ప్రజల పట్ల గౌరవం ఎంతో ముఖ్యమని తెలిపారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది అందరూ దేశ ఐక్యత, సమగ్రత, భద్రతను కాపాడటానికి అంకితభావంతో పనిచేస్తామని, దేశ సమైక్యతను మరింత బలోపేతం చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ, డిసిఆర్బి డిఎస్పి మల్లయ్య స్వామి, ఏఆర్ డిఎస్పి సత్యనారాయణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మంజ్య నాయక్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన చిన్నారులకు దుస్తుల పంపిణీ



పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక, అక్టోబర్ 31: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు, భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో చర్ల మండల పరిధిలోని చెన్నాపురం, ఎర్రంపాడు గిరిజన గ్రామాల్లో కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రెండు గ్రామాలకు చెందిన 100 మంది చిన్నారులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భద్రాచలం డీఎస్పీ గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గిరిజన గ్రామాల ప్రజల సంక్షేమం, అభివృద్ధికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని, ప్రజలకు అవసరమైన సమయంలో పోలీస్ శాఖ అండగా ఉంటుందని తెలిపారు.అనంతరం చిన్నారుల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపించాలని, వారికి మెరుగైన విద్యను అందించేందుకు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో చర్ల సీఐ రాజు వర్మ, ఎస్సై నర్సిరెడ్డి, స్పెషల్ పార్టీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరివర్తన ఆవాజ్

రైతుల డిజిటల్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి: డీఆర్ఓ పద్మావతి

అగ్రిస్టాక్ ద్వారా రైతు రిజిస్ట్రీ, డిజిటల్ క్రాప్ బుకింగ్ వందశాతం పూర్తి చేయాలి

ప్రభుత్వ పథకాలు, పంట రుణాలు, పంటల కొనుగోలులో రైతు ఐడీ కీలకం





పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక, అక్టోబర్ 31: జిల్లాలో అగ్రిస్టాక్ యాప్ ద్వారా చేపడుతున్న రైతు రిజిస్ట్రీ, డిజిటల్ క్రాప్ బుకింగ్ ప్రక్రియను వేగవంతం చేసి వందశాతం లక్ష్యాన్ని సాధించాలని జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో వివిధ శాఖల అధికారులతో కార్యక్రమం పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంలో డిజిటలైజేషన్‌లో భాగంగా అగ్రిస్టాక్ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా భూమి కలిగిన ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య (ఫార్మర్ ఐడీ) కేటాయించేందుకు రైతు రిజిస్ట్రీ చేపట్టినట్లు వివరించారు. జిల్లాలో మొత్తం 1.85 లక్షల మంది రైతులకు గాను ఇప్పటివరకు సుమారు 1.39 లక్షల మంది రైతుల రిజిస్ట్రేషన్ పూర్తయిందని, మరో 45 వేల మంది రైతుల నమోదు చేయాల్సి ఉందని తెలిపారు. మిగిలిన రైతులందరి వివరాలను నమోదు చేసి వందశాతం లక్ష్యాన్ని సాధించేందుకు అన్ని శాఖలు సహకరించాలని కోరారు. అలాగే డిజిటల్ క్రాప్ బుకింగ్‌లో భాగంగా గ్రామస్థాయిలో వాలంటీర్లను గుర్తించి క్షేత్రస్థాయిలో పంటల ఫొటోలు సేకరించి యాప్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. పంటల సాగు విస్తీర్ణం, పంటల వివరాలు ఖచ్చితంగా నమోదయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా సేకరించిన సమాచారం భవిష్యత్తులో వివిధ ప్రభుత్వ శాఖలకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. డీఆర్ఓ పద్మావతి మాట్లాడుతూ, రైతు రిజిస్ట్రీ ద్వారా రూపొందే రైతుల సమగ్ర సమాచారం వ్యవసాయం, ఉద్యానవనం, మార్కెటింగ్, పౌరసరఫరాలు, బ్యాంకింగ్, గ్రామీణాభివృద్ధి తదితర శాఖలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. రైతులకు పంట రుణాలు, ఆర్థిక సేవలు అందించడం, ధాన్యం, మొక్కజొన్న, పత్తి తదితర పంటల కొనుగోలు, పంటల బీమా, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగినప్పుడు పరిహారం అందించే ప్రక్రియలో ఫార్మర్ ఐడీ కీలకంగా ఉంటుందని వివరించారు. ఉద్యానవన శాఖ ద్వారా ఆయిల్‌పామ్ సాగు, డ్రిప్ ఇరిగేషన్ వంటి పథకాల అమలులో, డీఆర్డీఏ ద్వారా రైతులకు ఫామ్ పాండ్స్, ఇంకుడు గుంతలు, రీఛార్జ్ పిట్స్ వంటి సదుపాయాలు కల్పించే సమయంలో రైతు ఐడీని తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు తమ పరిధిలోని రైతులకు ఫార్మర్ ఐడీ ప్రాధాన్యతను వివరించి రిజిస్ట్రేషన్ చేసుకునేలా ప్రోత్సహించాలని ఆదేశించారు.రైతు రిజిస్ట్రేషన్ ప్రక్రియను మీసేవ, కామన్ సర్వీస్ సెంటర్లు, మండల వ్యవసాయ కార్యాలయాల ద్వారా సులభంగా పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు, మొబైల్ నంబర్‌తో రైతులు సమీప కేంద్రాల్లో నమోదు చేసుకోవచ్చని వివరించారు. మీసేవ, సీఎస్‌సీ కేంద్రాలకు వచ్చే రైతులకు ఫార్మర్ ఐడీ నమోదు విషయంలో అవగాహన కల్పించి అవసరమైన సహకారం అందించాలని ఆదేశించారు .రైతు రిజిస్ట్రీ, డిజిటల్ క్రాప్ బుకింగ్ కార్యక్రమాల విజయవంతమైన అమలుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని డీఆర్ఓ పద్మావతి సూచించారు.ఈ సమావేశంలో సీ పి ఓ సునీత,లీడ్ బ్యాంకు మేనేజర్ రామిరెడ్డి , ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వర రావు , ఉద్యానవన శాఖ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, పౌరసరఫరాలు, మార్కెటింగ్, ఐటీడీఏ, గిరిజన సంక్షేమం, నాబార్డ్, లీడ్ బ్యాంక్, పశు సంవర్ధక, సహకార, డీఆర్డీఏ తదితర శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు

ఘనంగా ముగిసిన జిల్లాస్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్







పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక, కొత్తగూడెం, అక్టోబర్ – 31 : భారత ప్రభుత్వ యువజన సర్వీసులు మరియు క్రీడా మంత్రిత్వ శాఖ, మై భారత్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆధ్వర్యంలో డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ లో ఘనంగా జిల్లాస్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బి. అనూష – జిల్లా పంచాయతీ అధికారి, జగన్ మోహన్ రాజు – కళాశాల ప్రిన్సిపాల్, కామేశ్వర్ రావు – ఎన్.ఎస్.ఎస్ జిల్లా కోఆర్డినేటర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మేరా యువ భారత్ అధికారి ఎం. వెంకట్ రాంబాబు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమం ఉద్దేశం యువతలో ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, దేశాభివృద్ధి పట్ల అవగాహన పెంపొందించే లక్ష్యంతో జిల్లాస్థాయి విక్షిత్ భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, భారతదేశాన్ని 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో యువత తమ ఆలోచనలు, అభిప్రాయాలను ప్రజాస్వామ్య పద్ధతిలో వ్యక్తపరిచేందుకు ఈ కార్యక్రమం ఒక మంచి వేదికగా నిలుస్తుందని బి. అనూష అన్నారు, యువతలో పార్లమెంటరీ వ్యవస్థ, రాజ్యాంగ విలువలు, పౌర బాధ్యతలు, దేశ నిర్మాణంలో యువత పాత్రపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. ఈ కార్యక్రమంలో యువత ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాలని, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని డిస్టిక్ యూత్ అధికారి రాంబాబు అన్నారు. ఈ “వన్ నేషన్ – వన్ ఎలక్షన్” అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో 58 విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో బి. నవదీప్ రెడ్డి, జి. మేఘన, జి. పావని జిల్లాస్థాయిలో గెలుపొంది రాష్ట్రస్థాయికి ఎన్నికవ్వడం జరిగింది.

గోదావరి పుష్కర పనులు గడువులోగా పూర్తి చేయాలి



పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక, అక్టోబర్ 31: రానున్న గోదావరి పుష్కరాల నేపథ్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావుతో కలిసి పలు జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఐడీఓసీ కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ అంకిత్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్ మాట్లాడుతూ, పుష్కరాల కోసం చేపట్టిన అన్ని అభివృద్ధి పనులను వేగవంతం చేసి పెండింగ్ పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. నూతన పుష్కర ఘాట్ల నిర్మాణం, ఇప్పటికే ఉన్న ఘాట్ల మరమ్మతులు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన పనుల పురోగతిని జిల్లాల వారీగా సమీక్షించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.పుష్కరాలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సురక్షితమైన తాగునీటి సరఫరాకు పక్కా ప్రణాళిక రూపొందించాలని, పుష్కర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భక్తులను ఆకట్టుకునేలా ఆకర్షణీయమైన లైటింగ్ ఏర్పాట్లు చేయాలని, ఘాట్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అలాగే పుష్కరాల అభివృద్ధి పనులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పుష్కరాల ఏర్పాట్లను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఈఓ దామోదర్ రావు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

37 ఏళ్ల నిస్వార్థ బోధనా సేవలకు ఆత్మీయ వీడ్కోలు

టేకులపల్లి హెచ్ఎం కంగాల వెంకయ్య పదవీ విరమణ



పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక, టేకులపల్లి, అక్టోబర్ 31: టేకులపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా సుదీర్ఘకాలం సేవలందించిన కంగాల వెంకయ్య 37 ఏళ్ల అంకితభావంతో కూడిన ఉపాధ్యాయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకుని శనివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ఆత్మీయ వీడ్కోలు, సన్మాన సభ భావోద్వేగ వాతావరణంలో ఘనంగా జరిగింది. మండల విద్యాశాఖ అధికారి అజ్మీరా జగన్, మండల నోడల్ అధికారి స్వరూప భవాని ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కంగాల వెంకయ్య ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన వ్యక్తి అని కొనియాడారు. మూడున్నర దశాబ్దాలకు పైగా వేలాది మంది విద్యార్థులను విద్యావంతులుగా, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఆయన చూపిన నిబద్ధత ప్రశంసనీయమన్నారు. మండలంలో విద్యాభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. అనంతరం అతిథులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు సీతమ్మ, విద్యా కమిటీ చైర్మన్ ఘోషతో పాటు పలువురు కలిసి కంగాల వెంకయ్య దంపతులను శాలువాలు కప్పి, పూలమాలలు వేసి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు.తోటి ఉపాధ్యాయులు నరేష్, వాలమ్మ, రవీందర్, రజిత, సరోజ, భాస్కర్‌రావు తదితరులు మాట్లాడుతూ.. వెంకయ్యతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఆయన పాటించిన క్రమశిక్షణ, అందించిన మార్గదర్శకత్వం తమకు ఎప్పటికీ ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.అనంతరం కంగాల వెంకయ్య మాట్లాడుతూ.. తన 37 ఏళ్ల సుదీర్ఘ ఉపాధ్యాయ ప్రస్థానంలో సహకరించిన విద్యాశాఖ అధికారులు, తోటి ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు, విద్యార్థులు, గ్రామ ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయ వృత్తిలో గడిపిన ప్రతి క్షణం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని భావోద్వేగంతో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రముఖులు, పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వెంకయ్య దంపతులకు ఆత్మీయంగా వీడ్కోలు పలికారు.

112 మంది మేట్లకు ఉపాధి హామీ పథకంపై శిక్షణ



పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక, అక్టోబర్ 31: టేకులపల్లి మండలంలోని ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డు రైతు వేదికలో శనివారం వికసిత్ భారత్ – గ్రామీణ్ (వీబీ–జీ రామ్ జీ) పథకం కింద పనిచేస్తున్న 24 గ్రామపంచాయతీలకు చెందిన 112 మంది మేట్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి విద్యాచందన, గ్రామ సర్పంచ్ పూల్‌బంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యాచందన మాట్లాడుతూ మేట్లు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి గ్రామపంచాయతీలో ఉపాధి పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని, కూలీలకు నిరంతరం పని కల్పించే విధంగా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని ఆదేశించారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో కొండపల్లి శ్రీదేవి, శిక్షణ కోర్సు డైరెక్టర్ రాజారత్నం, మొక్కల పెంపకం పర్యవేక్షకుడు రాజు, అదనపు కార్యక్రమ అధికారి కాలంగి శ్రీనివాస్, ఈసీ తిరుపతి మేట్ల విధులు, బాధ్యతలపై వివరించారు. నూతనంగా అమలులోకి వచ్చిన వికసిత్ భారత్ – గ్రామీణ్ (వీబీ–జీ రామ్ జీ) పథకంలోని మార్పులు, 375 రకాల పనులపై పూర్తి అవగాహన కల్పించారు. ప్రతి గ్రామపంచాయతీలో 80 మంది కూలీలతో పనులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రతి కుటుంబానికి ఒక ఆర్థిక సంవత్సరంలో 125 రోజుల వరకు ఉపాధి కల్పించే విధంగా పనులు చేపట్టాలని, రోజుకు రూ.308 చొప్పున కూలీ పొందేలా పనుల నిర్వహణ జరగాలని తెలిపారు. పని ప్రదేశాల్లో కూలీలకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించడంపై అవగాహన కల్పించారు.కొత్తగా జాబ్‌కార్డులు లేని కుటుంబాలకు, 18 సంవత్సరాలు నిండిన అర్హులైన వారికి జాబ్‌కార్డులు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్ఎంఎంఎస్ ద్వారా హాజరు నమోదు, ఈ–కేవైసీ, మస్టర్ల నిర్వహణ విధానాలపై మేట్లకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూల్‌బంతి, ఎంపీడీవో కొండపల్లి శ్రీదేవి, కోర్సు డైరెక్టర్ రాజారత్నం, పర్యవేక్షకుడు రాజు, ఏపీఓ కాలంగి శ్రీనివాస్, ఈసీ తిరుపతి, గ్రామపంచాయతీ కార్యదర్శులు, సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ సైబర్ సెక్యూరిటీ ఫ్లాష్ వాక్

సైబర్ మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి -- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్



పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక, అక్టోబర్ 31: తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహించిన సైబర్ సెక్యూరిటీ ఫ్లాష్ వాక్ కార్యక్రమం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఈ ఫ్లాష్ వాక్ కొత్తగూడెంలోని పోస్ట్ ఆఫీస్ సర్కిల్ నుంచి బస్టాండ్ సర్కిల్ వరకు కొనసాగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ విద్యార్థులు, యువతకు ప్రస్తుతం జరుగుతున్న వివిధ రకాల సైబర్ నేరాలు, వాటి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న మోసాలు, ఆన్‌లైన్ వేధింపులు, స్టాకింగ్, సైబర్ బుల్లీయింగ్, నకిలీ సోషల్ మీడియా ఖాతాలు, వ్యక్తిగత సమాచార దుర్వినియోగం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని వివిధ రకాల మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులకు ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు, వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించవద్దని సూచించారు. వాట్సాప్, ఎస్ఎంఎస్, సోషల్ మీడియా ద్వారా వచ్చే అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని, తెలియని వ్యక్తులు పంపే ఫొటోలు, ఫైల్స్‌ను డౌన్‌లోడ్ చేయవద్దని హెచ్చరించారు.తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని చెప్పే నకిలీ పెట్టుబడి పథకాలు, ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసాలు, డిజిటల్ అరెస్ట్ పేరుతో చేసే బెదిరింపులు, నకిలీ ఉద్యోగ ఆఫర్లు, లోన్ యాప్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫోటోలు, కుటుంబ వివరాలు, ఇతర సున్నితమైన సమాచారాన్ని పంచుకునే విషయంలో జాగ్రత్త వహించాలని, సైబర్ వేధింపులకు గురైతే భయపడకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు.ప్రతి ఒక్కరూ “ఆగండి -- ఆలోచించండి -- ధృవీకరించుకోండి” అనే సైబర్ భద్రతా సూత్రాన్ని పాటించాలని ఎస్పీ సూచించారు. ఏదైనా అనుమానాస్పద సందేశం లేదా లింక్ వచ్చినప్పుడు వెంటనే స్పందించకుండా ఆగి, దాని నిజానిజాలను ఆలోచించి, సంబంధిత వ్యక్తి లేదా సంస్థ వివరాలను ధృవీకరించుకున్న తర్వాతే స్పందించాలని తెలిపారు. సైబర్ నేరానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 కు కాల్ చేయాలని లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు.సురక్షితమైన డిజిటల్ సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, విద్యార్థులు సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా ఈ విషయాలపై అవగాహన కల్పించాలని ఎస్పీ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ, సీఐలు నరేష్, జితేందర్, వెంకటేశ్వర్లు, యాసీన్, ఇంద్రసేనారెడ్డి, పోలీస్ అధికారులు, సైబర్ వారియర్స్, సిబ్బంది, విద్యార్థులు, యువత తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ



పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక, అక్టోబర్ 31: టేకులపల్లి: భారతదేశ తొలి ఉప ప్రధానమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల టేకులపల్లిలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ఎం. పవన్ కుమార్ హాజరై సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్దార్ వల్లభాయ్ పటేల్ తన దృఢ సంకల్పం, పట్టుదలతో స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. స్వాతంత్ర్యం అనంతరం దేశంలోని 562 సంస్థానాలను భారత యూనియన్‌లో విలీనం చేసి జాతీయ సమైక్యతకు విశేష కృషి చేశారని కొనియాడారు. దేశ ఐక్యతకు ప్రతీకగా నిలిచిన పటేల్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బానోత్ బాబురావు, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు



క్కార్మికుల హక్కుల సాధనకు ఏఐటీయూసీ నిరంతర పోరాటం



పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక, అక్టోబర్ 31: ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం టేకులపల్లి మండల కేంద్రంలో మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ముందుగా సీపీఐ జిల్లా నాయకుడు గుగులోత్ రామ్ చందర్ ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 107 సంవత్సరాల చరిత్ర కలిగిన ఏఐటీయూసీ కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాటం చేస్తోందని తెలిపారు. పోరాటాల ద్వారానే కార్మికుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, వారికి న్యాయమైన ప్రతిఫలాలు అందించేందుకు సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.సింగరేణి, ఆర్టీసీ కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల్లో ఏఐటీయూసీ విజయం సాధించి కార్మికుల హక్కుల కోసం అనేక పోరాటాలు చేసిందని పేర్కొన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం, వారి సంక్షేమం కోసం భవిష్యత్తులోనూ నిరంతరం పోరాడుతామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి ఎజ్జు భాస్కర్, కోటేష్, కృష్ణ, బద్రు, మోహన్, రాజా, మోతీలాల్, కుమార్, రాజేష్, మురళి, నరేందర్, నరేష్, సోనీ, చిన్నారి తదితరులు పాల్గొన్నారు

ఇందిరాగాంధీకి కాంగ్రెస్ నాయకుల ఘన నివాళులు





పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక, అక్టోబర్ 31: భారత మాజీ ప్రధానమంత్రి, ఉక్కు మహిళ ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా టేకులపల్లి మండల కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో శనివారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, దేశానికి ఆమె చేసిన సేవలను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఇల్లందు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్, టేకులపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్కినేని శ్యామ్ పాల్గొని మాట్లాడుతూ దేశ ఐక్యత, సమగ్రత కోసం ఇందిరాగాంధీ చేసిన సేవలు, ఆమె త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు ఈది గణేష్, భద్రు, రెడ్యానాయక్, కాలే ప్రసాద్, పోశాలు, దేవానాయక్, రవి, సర్దార్, చందర్ సింగ్, సుభాష్ చంద్రబోస్, కోరం హనుమంతు, సంజయ్, లక్ష్మయ్య, బొడ్డు అశోక్, నాగేశ్వరరావు, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మిర్చి, క్యాప్సికం సాగుతో అధిక లాభాలు - - రైతుకు కలెక్టర్ ప్రశంసలు

కూరగాయల సాగుతో తక్కువ పెట్టుబడికి అధిక ఆదాయం పొందవచ్చని తెలిపిన రైతు





పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక, అక్టోబర్ 31: జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కోమిరెడ్డి అంజయ్య సాగు చేస్తున్న మిర్చి మరియు క్యాప్సికం తోటలను సందర్శించి, పంటల సాగు విధానం, దిగుబడి, మార్కెటింగ్, రైతుకు వస్తున్న ఆదాయం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు కోమిరెడ్డి అంజయ్య మాట్లాడుతూ, తాను గత మూడు సంవత్సరాలుగా క్యాప్సికం పంటను సాగు చేస్తున్నానని తెలిపారు. ఒక ఎకరా విస్తీర్ణంలో క్యాప్సికం సాగు చేసి సుమారు 30 టన్నుల దిగుబడిని సాధించినట్లు వెల్లడించారు. పండించిన పంటను టన్నుకు రూ.40,000 చొప్పున విక్రయించగా, మొత్తం రూ.12 లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. సాగు ఖర్చులు, ఇతర వ్యయాలు పోను సుమారు రూ.10 లక్షల వరకు నికర ఆదాయం పొందినట్లు సంతోషం వ్యక్తం చేశారు. సంప్రదాయ వరి సాగుతో పోలిస్తే కూరగాయల సాగు ద్వారా అధిక ఆదాయం పొందే అవకాశం ఉందని, ముఖ్యంగా క్యాప్సికం వంటి ఉద్యాన పంటలను శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేయడం వల్ల మంచి దిగుబడితో పాటు మెరుగైన లాభాలు పొందవచ్చని రైతు తన అనుభవాన్ని వివరించారు. గత మూడు సంవత్సరాలుగా క్యాప్సికం సాగు ద్వారా మంచి ఫలితాలు సాధిస్తున్నానని, ఇతర రైతులు కూడా పంటల మార్పిడి విధానాన్ని అనుసరిస్తూ కూరగాయల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ రైతుతో మాట్లాడి, ఉద్యాన పంటల సాగులో అనుసరిస్తున్న పద్ధతులు, పంటల యాజమాన్యం, దిగుబడి వివరాలను తెలుసుకున్నారు. సంప్రదాయ పంటలతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించడం ద్వారా వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చుకోవచ్చని పేర్కొన్నారు. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకొని, ఆధునిక సాగు పద్ధతులు పాటిస్తూ అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం సాధించాలని రైతులకు సూచించారు.రైతులు తమకున్న భూమి, నీటి వనరులు, మార్కెట్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించుకోవాలని, వ్యవసాయ మరియు ఉద్యాన శాఖల అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ ముందుకు సాగాలని ఈ సందర్భంగా సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్ వై గిరి జిల్లా ఉద్యాన మరియు పట్టుపరిశ్రమ శాఖ అధికారి జ్యోతి , జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రెడ్డి , ఉద్యాన శాఖ అధికారి సుమన్ , ఉద్యాన విస్తరణ అధికారి బాపురెడ్డి , ఇతర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఉప్పల్‌వాయిలో ఆలయ నిర్మాణానికి అడ్డంకులపై చర్యలు తీసుకోవాలి



పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక, అక్టోబర్ 31: ఉప్పల్ వాయి గ్రామంలో మాల పోచమ్మ, మాదిగ చిలకలమ్మ గుడి నిర్మాణాన్ని గ్రామ విడిసి కమిటీ సభ్యులు అడ్డుకుంటున్నారని, వారి పైన చర్యలు తీసుకొని వెంటనే వారినీ అరెస్ట్ చేయాలని అంబేద్కర్ యువజన సంఘం, ఎమ్మార్పీఎస్ సంఘం, మాల మహానాడు సంఘం డిమాండు చేశారు.కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్. అండ్. బి గెస్ట్ హౌస్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల బాబు, అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షులు కోత్తోల్ల గంగారం, అంబేద్కర్ సంఘం గౌరవ అధ్యక్షులు కొత్తపల్లి మల్లన్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి బట్ట వెంకట రాములు, మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ సుధాకర్, ప్రసన్న మాట్లాడుతూ ఉప్పల్ వాయి గ్రామంలోని గత విడిసి ఆధ్వర్యంలో గ్రామంలో ఒకే వద్ద 8 గుళ్లను కట్టుకోవాలని తీర్మానం చేయడం జరిగిందని, కొత్తగా వచ్చిన విడిసి కమిటీ సభ్యులు కుల వివక్షత చూపిస్తూ ఇక్కడ మాల పోచమ్మ, మాదిగ చిలుకలమ్మ గుడి కట్టొద్దని అంటున్నారని, దీనిపైన జిల్లా ఎస్పీ గారికి ఫిర్యాదు చేయడం జరిగిందని, వెంటనే వీడీసీ కమిటీ పైన కేసు నమోదు చేయడం జరిగింది తెలిపారు. అన్ని గుళ్ళతో పాటు మాల పోచమ్మ గుడి, మాదిగ చిలుకలమ్మ గుడి అన్ని గుడి నిర్మానులతో పాటు మా గుళ్లను కూడా నిర్మించాలని డిమాండ్ చేశారు. విడీసీ కమిటీ సభ్యులు రోజురోజుకు మితిమీరుతున్నాయని వీడిసి సభ్యులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు అధ్యక్షుడు కంకణాల రమేష్, అంబేద్కర్ సేవా సమితి అధ్యక్షులు ధ్యామణి భూపతి, ఆర్టిఐ లేగ్గేలా రాజు, ఎమ్మార్పీఎస్ మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తిగారి లక్ష్మి, ఉప్పల్ వాయి మాల కులగ్రామస్తులు పాల్గొన్నారు.

